
# గుండెలోని అనురాగం చూడు

జి. లక్ష్మీ అశోక్




పుచ్చపువ్వులా వెన్నెల కాస్తున్నా... పిల్లగాలులు సుతారంగా తాకిపోతున్నా, ప్రక్కనే పక్కపై అర్ధాంగి పడుకొని వున్నా, అప్పుడు సమయం అర్ధరాత్రి కావస్తున్నా డాబాపై నిద్ర రావడంలేదు శ్రీనివాస్‌కి.

కనురెప్పలు మూయబోతే ససేమిరా వీల్లేదంటూ తెరుచుకుంటున్నాయి. మదిలో ఆవేదన శోకరూపంలో బయటికొస్తుంది.

అసలు ఇలా జరుగుతుందని తాను ఏనాడూ అనుకోలేదు. కాని ఇలా జరిగింది. ఆ రిపోర్టులన్నీ పరిశీలించి డాక్టర్ రాధాకృష్ణమూర్తి చెప్పిన నిజం... తన పాలిట విషమే. ఆ నిజం మనసుని రంపపుకోత కోస్తుంటే ఎలా... ఎలా తట్టుకోవాలి?

కంటిపై జాలువారే కన్నీటిని చేతివ్రేలితో తుడిచేయగలడు. కాని మనసులోని గాయాన్ని ఎలా మాన్పుకోగలడు?

ఎంత వద్దనుకున్నా జరిగిన సంగతులు గుర్తుకొస్తున్నవి. స్కూల్లో చదివేరోజుల్లో నుండే శ్రీనివాస్‌కు సెక్స్‌పరమైన ఆలోచనలు వస్తుండేవి.

అప్పటి నుండే అందాలను ఆస్వాదించడం నేర్చుకున్నాడు. తల్లికి ఒక్కడే గారాల కొడుకు కావడంవల్ల, తండ్రి అసలే లేకపోవడంవల్ల, అతన్ని మందలించేవారే లేక అలా అలా తిరిగి అతను భ్రష్టుడయ్యాడు.

అతడి దృష్టిలో స్త్రీ శృంగారానికి మాత్రమే పనికివచ్చే వస్తువు. మగాడు ఆడమన్నట్టల్లా ఆడే కీలుబొమ్మ.

అయితే అతని సంగతి పదిమంది పది రకాలుగా చెప్పుకోవడంవల్ల ఇక లాభంలేదని పద్మతో అతని పెళ్ళి జరిపించింది వాళ్ళ అమ్మ వీరలక్ష్మి.

పద్మ చాలా అందగత్తె. తెల్లగా విందుగా వుంటుంది. పెదాలపై చెరగని చిరునవ్వుతో, కల్మషంలేని మనసుతో ఎవరినైనాసరే ఇట్టే ఆకర్షిస్తుంది.

పద్మలాంటి అందగత్తె భార్య ఐనా, తీయని అనుభూతులు జుర్రుకుంటున్నా శ్రీనివాస్ మరో ఆడదాని పొందుకోసం అర్రులు చాచేవాడు. అలా చేయడం మగవాడి హక్కు అనుకొనేవాడు.

పచ్చకామెర్ల రోగికి లోకం అంతా పచ్చగానే కన్పిస్తుందన్నట్టు అందమైన తన భార్యను ఎక్కడికి తీసుకెళ్ళాలన్నా ఒకరకంగా భయపడేవాడు. ఎందుకంటే- తాను ఇతరుల భార్యలను చూసినట్టు ఇతరులు తన భార్యను ఎక్కడ చూస్తారోనన్న ఆలోచన వచ్చేది శ్రీనివాస్‌కి.

అంతే కాకుండా పద్మ శ్రద్ధగా అలంకరించుకున్నా, పనిబడి పరాయి మగాడితో మాట్లాడినా సహించేవాడు కాదు శ్రీనివాస్.

అలా జరిగిపోతున్న శ్రీనివాస్ సంసారంలో కలతను రేపింది ఓ కారణం. పెళ్ళయి అయిదేళ్ళవుతున్నా పిల్లలు లేరని డాక్టర్‌కు చూపించుకోమని చెప్పిన పెద్దల సలహా ప్రకారం డాక్టర్ దగ్గరికెళ్ళి పరీక్ష చేయించగా-

పద్మలో ఏ లోపం లేదని, లోపం అంతా శ్రీనివాస్‌దేనని తేల్చి చెప్పారు డాక్టర్లు.

అదిగో-అప్పట్నుండి బెంగ మొదలైంది శ్రీనివాస్‌కు. ఈ విషయం పద్మతో చెప్పాడు. అయినా చిరునవ్వు నవ్విందే కాని శ్రీనివాస్‌ను ఈసడించుకోలేదు. ఆరోజు హాస్పటల్ నుండి రాగానే తల్లి అడిగింది.

"ఏరా డాక్టర్‌గారు ఏమన్నారు?"

అతనేం చెప్పకముందే తానే చెప్పేసింది పద్మ.

"కొంచెం ఆలస్యమైనా పిల్లలు పుడతారటత్తయ్యా."

"అవును. ఎందుకు ఆలస్యమౌందట?"

"మీ అబ్బాయిలో ఏ లోపం లేదట. లోపం అంతా నాదేనట. కొంచెం మందులు వాడితే సరిపోతుందట."

ఆ మాటలకు గబుక్కున తలెత్తి చూశాడు శ్రీనివాస్. పద్మనలా చూస్తుంటే ఆమె ఎంతో ఎత్తుకు ఎదిగిపోయినట్లు కనిపిస్తోంది.

"ఏమో తల్లి. ఇన్నాళ్ళైంది. ఓ ముద్దూ ముచ్చటా లేదు. కొన్నాళ్ళు చూసి మళ్ళీ పెళ్ళి చేయాలి. ఏం చేస్తాం... వంశం నిలవాలికదా?"

"అమ్మా" శ్రీనివాస్ విసుగ్గా అన్నాడు.

"అసరా నీ గోల" అంటూ ఇంట్లోకెళ్ళిపోయింది తల్లి.

ప్ప్... తాను ఎందరో ఆడవాళ్ళను ట్రాప్ చేశాడు కాని ఎందుకిలా జరిగింది? కట్టుకున్న భార్యముందే తను అపరాధి అయ్యాడు. బహుశా అందరి పాపం తగిలి వుండవచ్చు. అందుకే తనకిలా జరిగి వుండవచ్చు.

అయితే తన శిక్ష తన భార్య కూడా భరించాలా? ఏమిటీ ఘోరం?

ఆడవాళ్ళదే లోపం అయితే మగవాడు ఎన్ని పెళ్ళిళ్ళైనా చేసుకోవచ్చు. కాని మగవాడి లోపం జరిగితే ఆడది ఏమీ చేయకూడదు.

ఏమిటీ వ్యవస్థ? ఎందుకీ తేడా?

పాపం అమాయకురాలు పద్మ. తనను చేసుకొని జీవితాంతం పిల్లా జెల్లా లేక అలా వుండవలసిందేనా? మరి తన శిక్షకు ఆమెనెందుకు బలిచేయాలి?

ఆలోచనలతో శ్రీనివాస్ తల వేడెక్కిపోయింది. అంతులేని సంఘర్షణ. తాను చేసిన నేరానికి తనకే శిక్ష విధించుకోవాలి. పద్మకో కొత్త జీవితం ఇవ్వాలి. బంగారు పంజరంలోని పద్మకు స్వేచ్ఛనివ్వాలి.

తన భుజం మీది మెత్తని స్పర్శకు ప్రక్కకు తిరిగి చూశాడు శ్రీనివాస్.

"ఏమిటండీ... మీరింకా పడుకోలేదా?"

"పద్మా... నేనొకటి చెబుతాను. నా మాట వింటావా?"

"ఏమిటండీ?"

"పద్మా... నావల్ల నీ జీవితం నిష్ఫలం కాకూడదు. నేను మనస్ఫూర్తిగా చెబుతున్నాను. నీవు నీ ఇష్టం వచ్చినవ్యక్తిని పెళ్ళాడి పిల్లాపాపలతో కళకళగా వుండాలి" అంటున్న శ్రీనివాస్ కంఠం ఆర్ద్రమైంది.

భర్త బాధను అర్థం చేసుకుంది పద్మ. తనంటే తన భర్తకు ఎంత ప్రేమో తల్చుకుంటే గర్వంగా వుంది ఆమెకు.

"ఏమండీ... నాకు కావలసింది మీరేనండి. నేను జీవితాంతం మీకు తోడుగా వుంటాను. నా గుండెలో ఒదిగిపోయే మీరే నా చిన్నిపాప. కాదంటారా?"

చిన్నపిల్లాడిని బుజ్జగించినట్లున్న ఆమె మాటలకు ఏం ఎదురుచెప్పలేకపోయాడు శ్రీనివాస్.

"చూడండి. మీ బాధను నేను అర్థం చేసుకోగలను. కేవలం పిల్లలు లేరనే ఒక్క వంకతో మిమ్మల్ని నేను దూరం చేసుకోలేను. మీతో పంచుకున్న జీవితాన్ని మీకే అర్పించుకున్న నామనసును మీకు కాక వేరే వ్యక్తికి ఎలా అందివ్వగలననుకున్నారు? మీరు నన్ను ఇంతేనా అర్థం చేసుకున్నది? నాకు మీరు... మీకు నేను... అది చాలదా మనకు?" భర్త జుట్టును లాలనగా నిమురుతూ అంది పద్మ.

ఇన్నాళ్ళు తాను మగువ గుండెలను కోరికతో చూడటమేగాని, ఆమె గుండెలోతుల్లోని అనురాగాన్ని అర్థం చేసుకోలేకపోయాడు.

స్త్రీ కేవలం శృంగారానికే తప్ప మరెందుకు పనికిరాదనుకున్నందుకు ఇప్పుడు చింతిస్తున్నాడు.

ఆమె లాలనలో కరిగిపోతున్నాడు అతడు. ఆ అమృతమూర్తిలోని విశాల హృదయానికి జోహారులర్పిస్తున్నాడు అతడు.

## ఇది నిజం

"లేసర్" కిరణాలను కనుగొన్న వ్యక్తి ఎవరు?

జ : గార్ జన్ గార్డ్, 1952 సంవత్సరంలో కనుగొన్నాడు.

డి. సత్యానంద్


# అతి ప్రాచీన నాడి జ్యోతిషము

బొటనవ్రేలి ముద్రతో అతి ప్రాచీన నాడి జ్యోతిషం పుట్టిన తేది ఉన్నను, లేకున్నను సంపూర్ణ జీవిత జాతకము-**Past - Present Future-** మహర్షుల **Extracts**-లభ్యము.

సృష్టికర్తయగు భగవంతునిచే నిర్మించబడిన జ్యోతిష శాస్త్రము విశేష మర్మములచే మిళితమైయున్నందున అందలి శ్లోకములు సామాన్యముగా దారిని చూపునుగాని యందలి గుప్తమైయుండు రహస్యములనగుపఱచవు గనుక కేవలము శ్లోకార్ధములచే జాతక ఫలములను చెప్పుటకు సాధ్యము కాదు. విశేష అనుభవము చేతను, విశేష అనుభవముగల జ్యోతిష్కుల బోధ చేతను, విశేష ప్రజ్ఞ చేతను పాటుపడి శోధించకగా శ్లోకములందలి రహస్యము దెలియవు.

జ్యోతిష్యమునందు కేవలము ఋషి ప్రోక్తములై మన పూర్వ మహారాజుల కాలంలో అప్పటికపుడు నిదర్శనముగా ఫలములు చెప్పగల మహాపండితుల హస్తగతమైయు కొన్ని పురాతన గ్రంధములుండినవి. రానురాను రాజ పోషణ తక్కువ అగుటచే ఈ శాస్త్రము చాలా భాగము అంతరించినదనియే చెప్పవచ్చును. ప్రస్తుతము అన్ని చోట్ల అమ్మబడుచున్న గ్రంధముల విలువ తెలిసియున్న విషయమే. తాళపత్ర గ్రంధములు మిగిలియున్నను శాస్త్రమునందుండు రహస్యములను అందరు తెలిసికొన్నచో వారి పాండిత్యము భంగము కల్గుననియు లేక వేరొక కారణముచేతగాని మన పండితులు అచ్చువేయించక దాచియుంచినారు.

ముఖ్యముగా లోకమునకు మహోపకారము కొరకు మహనీయులైన మహర్షులు సంస్కృతమున అనేక జ్యోతిష గ్రంధములు లిఖించియుండిరి. వానిలో కొన్ని మాత్రము మన పండితుల వలన ముద్రించబడియున్నవి. మరికొన్ని ముద్రించబడక యున్నవి. అట్టి ముద్రించబడని గ్రంధములలో గొన్ని తాటియాకులలో శిధిలమయి యున్న వాటి ఆధారముగా ఈ అతి ప్రాచీన నాడి జ్యోతిషము.....

డా. యన్. కృష్ణమూర్తి
శాంతిధియేటరు ఎదురుగా
గాంధీనగరు,
విజయవాడ - 3

**Phones : 66801**
**74531**

GOPI KRISHNA